

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా: సీఎం

బెంగళూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని సీఎం సిద్దరామయ్య హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు నిరసనకు సిద్ధంకావడంతో బుధవారం విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 1.20 లక్షలమంది ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. 2016 కంటే ముందు నియమితులైన వారికి ఎన్‌సీటీ నిబంధనల ప్రకారం విద్యార్హతనుబట్టి జీపీటీ గుర్తింపుతోపాటు పలు అంశాలపై ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ మేరకు చర్చలు జరిపారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఏ1గా నటి పవిత్రగౌడ

17 మందిపై 3,991 పేజీలతో కోర్టుకు సమర్పణ

సమగ్రంగా దర్యాప్తు : నగర పోలీస్ కమిషనర్

చార్జిషీట్‌లో.. ఏ2గానే దర్శన్



దర్శన్ (ఫైల్)

బెంగళూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్యకేసులో కన్నడ స్టార్ హీరో దర్శన్ తూగుదీపపై చార్జ్‌షీట్ దాఖలయింది. రెండున్నర నెలలపాటు సాగిన కేసు మలుపులకు చార్జ్‌షీట్‌తో ఒక కొలిక్కి వచ్చింది. బుధవారం 3,991 పేజీలతో 17మంది నిందితులపై బెంగళూరులోని 24వ ఏసీఎంఎం కోర్టు ముందు ప్రిలిమినరీ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. హత్యతోపాటు కీలకమైన కేసులలో 90 రోజులలోగా చార్జ్‌షీట్ దాఖలు చేయాలనే నిబంధనకు అనుగుణంగా పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నటుడు దర్శన్ సహనటి పవిత్రగౌడతో సన్నిహితంగా ఉన్నారు. వీరిద్దరి సంబంధంపై దర్శన్ కుటుంబంలోనూ అటు ఆయన అభిమానులలోనూ అసంతృప్తి కొనసాగింది. చిత్రదుర్గకు చెందిన మెడికల్ షాప్‌లో పనిచేసే రేణుకాస్వామి అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పవిత్రగౌడకు అశ్లీల చిత్రాలు పంపాడు. వరుసగా ఫొటోలు, వీడియోలు పంపడంతోపాటు 'దర్శన్‌తో ఎందుకు, నాతో సంబంధం పెట్టుకో' అంటూ కూడా మెసేజ్‌లు చేసేవాడని ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయాన్ని పవిత్రగౌడ దర్శన్‌కు వివరించారు. ఆగ్రహానికి లోనైన దర్శన్ అతడు ఎవరో తెలుసుకోవాలని ఆప్తులకు సూచించారు. రేణుకాస్వామి చిత్రదుర్గకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇలా చిత్రదుర్గలోని దర్శన్ అభిమాన సంఘం అధ్యక్షుడి ద్వారా రేణుకాస్వామిని కిడ్నాప్ చేసి బెంగళూరుకు తీసుకొచ్చారు. కామాక్షిపాళ్యలోని ఓ కారు షెడ్‌కు తీసుకొచ్చి దర్శన్, పవిత్రతోపాటు పలువురు చితకబాదారు. కాసేపటికి దర్శన్ అక్కడి నుంచి వెళ్లిపోయినా ఆయన అనుచరులు నిరంతరంగా కొట్టడంతో రేణుకాస్వామి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న దర్శన్ మరోసారి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని దూరంగా తరలించేందుకు ప్రయత్నించారు. ఆ తర్వాత కొందరికి సూచించారు.

సమగ్రంగా దర్యాప్తు : నగర పోలీస్ కమిషనర్



చార్జ్‌షీట్ వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ దయానంద్

కామాక్షిపాళ్యలోని పట్టణగెరె షెడ్‌లో రేణుకాస్వామి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు సాగిందని, 3,991 పేజీలతో చార్జ్‌షీట్ సమర్పించామని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ వెల్లడించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విచారణలో డాక్టర్లు, ఇంజనీర్లు, ఆర్‌టీఓలు, తహసీల్దార్‌తోపాటు 56మంది పోలీసులతో కలిపి 231 మంది నుంచి వివరాలు సేకరించామని వెల్లడించారు. 17 మంది అరెస్టుతోపాటు బెంగళూరు ఫోరెన్సిక్, హైదబాద్ సెంట్రల్ ఫోరెన్సిక్ నివేదికలు, ఎలక్ట్రికల్ వస్తువులను ఉపయోగించామన్నారు. నిందితులు తప్పించుకునే ప్రయత్నమే లేకుండా చార్జ్‌షీట్ నమోదు చేశామన్నారు. ఏసీపీ చందన్‌కుమార్ నేతృత్వంలో దర్యాప్తు సాగిందన్నారు. ఇదే విషయమై రేణుకాస్వామి తండ్రి కాశీనాథ-శివనగౌడ స్పందిస్తూ చార్జ్‌షీట్ కాపీ తీసుకున్నాక కేసు ఎలా నమోదు చేశారనేది పరిశీలిస్తామన్నారు.

తప్పించే ప్రయత్నంలో ఇరుక్కున్నారు..

కామాక్షిపాళ్యలో అనుమానాస్పద మృతదేహం లభించడంతో పోలీసులు విచారణకు సిద్ధం కాకముందే గిరినగర్‌కు చెందిన ముగ్గురు లొంగిపోయారు. తమకు అప్పు ఇవ్వాల్సి ఉండడంతో కొట్టడంతో చనిపోయాడని చెప్పారు. చిత్రదుర్గవాసికి మీరెందుకు అప్పు ఇచ్చారని పోలీసులు ప్రశ్నించి మొబైళ్ల స్వాధీనం చేసుకోవడంతో దర్శన్ విషయం వెలుగు చూసింది. జూన్ 9న కేసు నమోదు చేసుకున్న పోలీసులు 11న మైసూరులో సినిమా షూటింగ్‌లో ఉన్న దర్శన్‌ను అరెస్టు చేశారు. అప్పటి నుంచి పోలీసులు భిన్నమైన కోణాల్లో దర్యాప్తు చేపట్టగా ఒక్కో అంశం వెలుగులోకి వచ్చాయి.

17 మంది అరెస్ట్

రేణుకాస్వామి హత్య కేసులో ఒక్కొక్కరుగా పట్టుబడుతూ వచ్చారు. అనతి కాలంలోనే మొత్తం 17 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రతి ఒక్కరూ తప్పించుకునే యత్నంలో తప్పిదాలు చేస్తూ పట్టుబడినవారే. ఏ1గా నటి పవిత్ర గౌడ, ఏ2గా దర్శన్ పేర్లు నమోదయ్యాయి. వీటిలో మార్పులు ఉంటాయనే చర్చ జరిగినా చార్జ్‌షీట్‌లో యథావిధిగా నమోదు చేశారు. మొత్తం 231 మంది సాక్షులను విచారించారు. ఫోరెన్సిక్ రిపోర్టులు 8 సేకరించగా ప్రత్యక్ష సాక్షుల ముగ్గురి వాంగ్మూలాలు కూడా ఉన్నాయి.


దర్శన్ విలాసంతో బళ్లారి జైలుకు ..

హత్యకేసులో దర్శన్ అరెస్టు అయినప్పటి నుంచి ఏదో ఒక ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నారు. పరప్పన అగ్రహార జైలులో ఎక్కువ మంది ములాఖత్ వివాదం కొనసాగింది. ఇటీవలే జైలులో విలాసవంతంగా నలుగురితో కలసి కూర్చుని కాఫీ, సిగరెట్ సేవిస్తున్న ఫొటోలు వైరల్ అయ్యాయి. ఈ వివాదం జైళ్ల శాఖకే కాకుండా ఏకంగా ప్రభుత్వానికే తలనొప్పి తెచ్చిపెట్టింది. దీంతో బెంగళూరు పరప్పన జైలులో ఉండే ఈ నిందితుల బృందాన్ని రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు జైళ్లకు పంపారు. అందులో భాగంగానే దర్శన్‌ను బళ్లారికి తరలించారు. ఆయన బళ్లారికి చేరుకుని వారం కాకముందే చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

సీఎం గౌరవంగా తప్పుకోవాలి

రాజీనామా చేయక తప్పదు

మాజీముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప



బెంగళూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ముడా' ఇంటి స్థలాల వివాదంలో కోర్టు తీర్పుకంటే ముందుగా సిద్దరామయ్య సీఎం పదవికి రాజీనామా చేస్తే గౌరవంగా ఉంటుందని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత బీఎస్ యడియూరప్ప తెలిపారు. శివమొగ్గలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోర్టు తీర్పు తర్వాత వందశాతం సిద్దరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ముందుగానే గౌరవం కాపాడుకోవడం సముచితమన్నారు. ఇకపై ముడా విషయంలో పోరాటం అవసరం లేదని, వివాదం తుదిదశకు చేరిందన్నారు. కాగా కోర్టు ఈ కేసును ఈనెల 9కు వాయిదా వేసింది. 12లోగా విచారణలు పూర్తి చేయాలని కోర్టు సూచించిన సంగతి విదితమే. బెంగళూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య రాజీనామాకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. మంత్రులు విధానసౌధకు రావడం లేదన్నారు. బీజేపీ - జేడీఎస్ చేపట్టిన పోరాటానికి ఇప్పటికే మంత్రి నాగేంద్ర రాజీనామా చేశారని, తదుపరి పరిణామాలు త్వరలోనే ఉంటాయన్నారు. ముడా మాజీ కమిషనర్ జీటీ దినేశ్ సస్పెండ్ చేయడంతోనే ప్రభుత్వం వివాదంలో అవినీతి జరిగిందని అంగీకరించినట్టయ్యిందని ప్రతిపక్షనేత అశోక్ పేర్కొన్నారు. బెంగళూరులో ఆయన మాట్లాడుతూ ముడాలో పది నెలలక్రితమే అవినీతి నివేదిక బయటకు వచ్చినా ప్రభుత్వం మూసివేసే కుట్ర పన్నిందన్నారు.

కాంట్రాక్టర్ల నిరసన

ఫ్రీడం పార్కులో కాంట్రాక్టర్ల నిరసన



బెంగళూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీబీఎంపీ పరిధిలో 2021 ఏప్రిల్ నుంచి చేపట్టిన పనులకు బిల్లు మొత్తంలో 75శాతం మాత్రమే చెల్లింపులు అయ్యాయని మిగిలిన 25శాతం బకాయిల మొత్తాన్ని విడుదల చేయాలని కంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. నగరంలోని ఫ్రీడంపార్కులో బుధవారం నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఈమేరకు బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి, డీసీఎం డీకే శివకుమార్‌కు, బీబీఎంపీ కమిషనర్‌కు వినతులు ఇచ్చినా కేవలం హామీలే మిగిలాయని గ్రాంట్లు విడుదల కాలేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. బకాయిలు విడుదల య్యేంతవరకు తమ నిరసన కొనసాగిస్తామని బీబీఎంపీ కంట్రాక్టర్‌ల సంఘం అధ్యక్షుడు నందకుమార్ తెలిపారు.



రాహుల్‌తో సతీశ్‌జార్కిహొళి భేటీ

ఢిల్లీలో మంతనాలు

కాంగ్రెస్‌లో గందరగోళం


బెంగళూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్‌లో గందరగోళం కొనసాగుతోంది. 'ముడా' వివాదంలో ఇరుక్కున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య మరింతకాలం కొనసాగుతారా.. లేదా అనేది పార్టీలో సందిగ్ధంగా మారుతోంది. ఇటీవల సీఎం, డీసీఎంతోపాటు దాదాపు మంత్రివర్గం ఢిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీని కలసి వచ్చారు. ఇదే సందర్భంలోనే రాహుల్‌గాంధీని హోంశాఖ మంత్రి పరమేశ్వర్ ప్రత్యేకంగా భేటీ కావడం చర్చనీయాంశమయింది. రాహుల్‌ను కలిసింది వాస్తవమేనని, ఏమి చర్చించామో బహిరంగపరచలేనంటూ దాటవేశారు. ఇది మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. బద్ధశత్రువులుగా కొనసాగుతున్న డీసీఎం డీకే శివకుమార్, మంత్రి సతీశ్ జార్కిహొళి రహస్యంగా కలసిన విషయం తెలిసిందే. ఢిల్లీ నుంచి వచ్చిన పరమేశ్వర్, సిద్దరామయ్యకు ఆప్తుడు, సీనియర్ నేత సతీశ్‌జార్కిహొళి ఇంటికి వెళ్లి చర్చించడం ఆసక్తికరంగా మారింది. వీరిద్దరితోపాటు బీకే హరిప్రసాద్ ఉండడం మరో విశేషం. ఇలా సాగుతుండగానే రెండు రోజుల కిందట సతీశ్ జార్కిహొళి ఢిల్లీ వెళ్లి రాహుల్‌గాంధీని కలవడం మరో కీలకాంశంగా మారింది. ఆయన ఢిల్లీ పర్యటన రహస్యంగా ఉంచడం పార్టీ వర్గాల్లోనూ కుతూహలంగా మారుతోంది. సతీశ్‌జార్కిహొళి చుట్టూ రాజకీయం తిరుగు తోంది. ఆయన ఢిల్లీ వెళ్లడం ఇదేమి కొత్తకాకపోయినా రాజకీయంగా ఎలాంటి మలుపులు ఉంటాయనేది చర్చనీయాంశమవుతోంది. ముఖ్యమంత్రి కుర్చీ ఖాళీ లేదంటూనే తాను సైతం అంటూ అభిప్రాయాలు వ్యక్తం చేసేవారు ఎంతోమంది ఉన్నారు. సిద్దరామయ్య అంగీకరిస్తే తాను సీఎం అవుతానంటూ ఆర్‌వీ దేశ్‌పాండే మాట్లాడారు. అందుకు దీటుగా సహకారశాఖ మంత్రి రాజణ్ణ హాసన్‌లో స్పందించారు. రాష్ట్రంలో ఎంతోమంది ముఖ్యమంత్రి అయ్యేందుకు అర్హులు ఉన్నారని, ఆర్‌వీ దేశ్‌పాండే ఒక్కరే కాదన్నారు. రాష్ట్రంలో బీసీ సమాజంలో దేవరాజ్ అరసు, బంగారప్ప తర్వాత ప్రజాదరణ ఉండేది సిద్దరామయ్యకు మాత్రమే అన్నారు. అందుకే కాంగ్రెస్‌లోని కొందరు కుట్ర పన్నుతున్నారని, మరోవైపు బీజేపీ, జేడీఎస్ అందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఇదే విషయమై మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై మాట్లాడుతూ కాంగ్రెస్‌లో శక్తివంతమైన నాయకుడు వీరేంద్రపాటిల్ అని, రాత్రికి రాత్రి ఎమ్మెల్యేలంతా మార్పు అయ్యారన్నారు. గదగ్‌లో మీడియాతో మాట్లాడుతూ వీరేంద్రపాటిల్ శక్తివంతమైన సీఎం అయినా ఎమ్మెల్యేలు మారిపోవడంతో పదవి కోల్పోయారన్నారు. దేవరాజ్ అరసును రాత్రికి రాత్రి మార్పు చేసి గుండూరావు ముఖ్యమంత్రి అయ్యారన్నారు. బంగారప్పకు 183 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నా మార్పు జరిగిందన్నారు. కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలతో ఏదైనా జరగవచ్చునన్నారు. ఇక్కడ బలం కంటే అధిష్టానం ఒక్కోసారి కీలకమవుతుందన్నారు.





సతీశ్ జార్కిహొళి

తుంగభద్ర 10 క్రస్ట్‌గేట్ల గుండా నదిలోకి వెలుతున్న వరద నీరు



తుంగభద్రకు మళ్లీ జలకళ

23 రోజుల తరువాత పూర్తి స్థాయిలో నిండిన జలాశయం

10 క్రస్ట్‌గేట్ల ద్వారా నదికి నీరు విడుదల

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 4: తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్ కొట్టుకుపోయాక.. 23 రోజుల సుదీర్ఘ విరామం తరువాత తుంగభద్ర జలాశయానికి మళ్లీ జళకళ వచ్చింది. బుధవారం ఉదయం 10 క్రస్ట్‌గేట్లను ఎత్తి 30వేల క్యూసెక్కుల నీటిని నదికి వదిలారు. కర్ణాటక, ఉమ్మడి ఏపీ రైతుల జలజీవనాడిగా నిలిచిన తుంగభద్ర జలాశయానికి ఆగస్టు 10వ తేదీ రాత్రి ఉపద్రవం ముంచుకొచ్చింది. తుంగభద్రకు ఏర్పడిన ఉపద్రవం కారణంగా మూడు రాష్ట్రాల ఆయకట్టు రైతులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. వారం రోజుల పాటు ఆనకట్టల గేట్ల నిపుణుడు కన్నయ్య బృందం, వందల సంఖ్యలో కార్మికులు, అధికారులు అవిరళ శ్రమ కారణంగా తుంగభద్ర జలాశయం 19వ గేటుకు స్టాప్‌లాగ్ ఏర్పాటు చేసి విజయ సాధించారు. 19వ క్రస్ట్‌గేట్ కొట్టుకుని పోయిన కారణంగా దాదాపు 30 టీఎంసీల వరద నీరు వృథా కావడంతో రైతులు తల్లడిల్లిపోయారు. పైప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో మళ్లీ తుంగభద్రకు జళకళ సంతరించుకోవడంతో ఆయకట్టు రైతుల్లో ఉత్సాహం వెల్లివిరిస్తోంది. ఇటు అధికారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయానికి జలాశయం పూర్తి స్థాయిలో నిండింది. ఈ నేపథ్యంలో జలాశయం భద్రతా దృష్ట్యా బుధవారం ఉదయం 11గంటల సమయంలో జాశయం 10 క్రస్ట్ గేట్లు ఒక అడుగు ఎత్తి సుమారు 30వేల క్యూసెక్కుల మేర నదికి విడుదల చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తుంగభద్ర భద్రత విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దేశంలో ఉన్న బహూళార్థక ప్రాజెక్టుల్లో ఒకటైన తుంగభద్రకు ఎక్కడాలేని ముప్పు వాట్లింది.

ఏపీ సీఎం సహాయనిధికి బీఎస్‌ఆర్ కోటి విరాళం

బెంగళూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వరద బీభత్సంపై స్పందించిన బీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఎండీ బలుసు శ్రీనివాసరావు సీఎం సహాయనిధికి రూ.కోటి విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి రూ.కోటి చెక్కును అందించారు. ఇదే విషయమై బీఎస్‌ఆర్ సంస్థ నగరంలో ఒక ప్రకటన విడుదల చేసింది. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు బీఎస్‌ఆర్ ఉదారతను చాటుకున్నారందన్నారు. వరద బాధితులకు సాయం చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునకు స్పందించి సినిమా, పారిశ్రామిక రంగాలకు చెందిన వారు ముందుకొస్తున్న విషయం తెలిసిందే. చంద్రబాబు పిలుపు మేరకు బలుసు శ్రీనివాసరావు కోటి రూపాయల విరాళంగా ఇచ్చారు.




ఏపీ సీఎంకు చెక్కుఅందజేస్తున్న శ్రీనివాసరావు




పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

బెంగళూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నగరంలోని పార్టీ కార్యాలయం జగన్నాథభవన్‌లో రాష్ట రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ప్రారంభించారు. ఆటో డ్రైవర్ల నుంచి పార్టీ సభ్యత్వ నమోదు చేశారు. ప్రతిపక్షనేత ఆర్.అశోక్, మాజీ ఉపముఖ్యమంత్రి గోవింద కారజోళ, సహ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి, మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, ఎంపీలు పీసీ మోహన్, డాక్టర్ సీఎన్ మంజునాథ్, మాజీ మంత్రులు గోపాలయ్య, మునిరత్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సునిల్‌కుమార్, నందీశ్‌రెడ్డి, ప్రీతమ్‌గౌడ, పి.రాజీవ్, ఎమ్మెల్యే ఎస్‌ఆర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. మంగళూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సీఎం డీవీ సదానంద గౌడ, ఎమ్మెల్యే వేదవ్యాస కామత్, మేయర్ సుధీర్‌శెట్టి కణ్ణూరు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.92	1,624.16
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	39,945	559
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,235	8,737
సామర్థ్యం (టీఎంసీలు)	101.46	73.78

ఏపీఎంసీ అధ్యక్షుడి పదవీకాలం
ముగిసింది


ఏపీఎంసీ కార్యాలయం

● ఆ బాధ్యతలు జిల్లాధికారికి అప్పగింత... ● ఏపీఎంసీ సెక్రటరీ నంజుండ స్వామి వెల్లడి

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 4: బళ్లారి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షుల పదవీకాలం సెప్టెంబరు రెండున ముగిసింది. దీంతో ఏపీఎంసి పాలనా బాధ్యతలను బళ్లారి జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రాకు అప్పగిస్తూ రాష్ట్ర వ్యవసాయఉత్పత్తుల మార్కెట్ సమితి డైరెక్టర్ శివానంద ఆదేశాలు జారీ చేసినట్లు ఏపీఎంసీ సెక్రటరీ తెలిపారు.

గతంలో 12వారాల తరువాత కార్యవర్గ ప్రమాణం

కర్ణాటక వ్యవసాయ ఉత్పత్తుల వ్యవహార అధికరణం 1966 ప్రకారం బళ్ళారి, కురుగోడు, సండూరు తాలూకాలను చేర్చి బళ్ళారి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సమితి (ఏపీఎంసీ)ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆలస్యంగా ఏపీఎంసీ నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. ఈ సభ్యుల ఎంపికపై లోక్‌సభ ఎన్నికల ముందు మార్చి 16వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. బళ్ళారి ఏపీఎంసీ బళ్ళారి సిటీ, రూరల్ నియోజకవర్గం పరిధిలోకి వస్తుండడంతో గ్రామీణ నియోజక వర్గం నుండి 9 మందిని, సిటీ నియోజకవర్గం నుండి ఇద్దరిని ఎంపిక చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. మరుసటి రోజు నుండే కోడ్ అమల్లోకి రావడంతో నూతనంగా బళ్ళారి ఏపీఎంసికి ఎన్నికైన కట్టెమని నాగేంద్రప్ప జూన్ 13న అధికార బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు కొళగల్లు గ్రామానికి చెందిన హాలెప్ప ఉపాధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. అధికార బాధ్యతలు చేపట్టిన పాలనా మండలి సభ్యుల మధ్య సఖ్యత లేకపోవడంతో ఏపీఎంసిలో జరిగిన సామాన్య సమావేశాలు అన్ని తూతూ మంత్రంగానే జరిగాయి గత నెల 22వ తేదీన ఉపాధ్యక్షుడు తన పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బి. నాగేంద్ర వివిధ కారణాల చేత జైలులో ఉండడంతో ఏపీఎంసిలో నాగేంద్ర మద్దతు దారులకు సముచిత గౌరవం లభించడం లేదని, ఆ కారణంగానే ఉపాధ్యక్షుడు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పడం చర్చనీయాంశమైంది. అధ్యక్ష, ఉపాధ్యక్షుల కాలావధి ముగియడానికి కేవలం 10 రోజుల ముందు ఉపాధ్యక్షుడు రాజీనామా చేయడం పెద్దగా ప్రాధాన్యత సంతరించుకోకపోవడం విశేషం. ఈ విషయంపై అధ్యక్షులు కూడా ఉపాధ్యక్షుల రాజీనామా ఆయన వ్యక్తిగత విషయమని కొట్టిపాయడం ఉద్దరి మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయనడానికి ఊతం పోసినట్లు అయింది...

మళ్లీ అధ్యక్ష స్థానం దక్కించుకునేందుకు ప్రయత్నాలు...

కాగా కట్టెమనె నాగేంద్రప్ప మరోసారి అధ్యక్ష పీఠం అధిరోహించడానికి భారీగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. అందు కు సిటీ ఎమ్మెల్యే ఆశీస్సులు పుష్కలంగా ఉండడంతో రెండోసారి అధ్యక్ష స్థానం దక్కించుకునేందుకు బెంగళూరులో భారీగా సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే బళ్ళారి ఏపీఎంసి పాలనా మండలి ఎంపికలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు రైతు వర్గాలకే ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నా... అధికార పార్టీ నిర్ణయాలతో నియమాలు ఉల్లంఘించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వ్యక్తులకే అధ్యక్ష స్థానం కల్పించాలని నిబంధనలు ఉన్నా... నగర ప్రాంతాల వ్యక్తులకు అధ్యక్షస్థానం కట్టబెట్టినట్లు, నిజమైన గ్రామీణ ప్రాంత రైతులకు అన్యాయం జరిగిందన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. ఈ సారి ప్రభుత్వం కొత్తగా బళ్లారి ఏపిఎంసికి పాలక మండలి సభ్యులను సరియైన విధంగా ఎంపిక చేయాలని గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతు ప్రముఖులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే బి. నాగేంద్ర జైలులో ఉన్న కారణంగా నూతన పాలక మండలి ఏర్పాటు కొంతమేర ఆలస్యమయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

వైభవంగా కట్టే బసవేశ్వర రథోత్సవం


కట్టెబసవేశ్వరస్వామి రథోత్సవం

బళ్లారిరూరల్, సెప్టెంబరు 4 : తాలుకాలోని ఎత్తిన బూదేహాళ్ గ్రామంలో కట్టే బసవేశ్వర మహా రథోత్సవాన్ని మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. బసవేశ్వరస్వామి దేవస్థానం నుండి ఎదురు బసవన్న దేవస్థానం వరకు భక్తులు అంగరంగ వైభవంగా ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ రథోత్సవంలో పలు గ్రామాల నుండి ప్రజలు పెద్దఎత్తున పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంపీ తుకారామ్‌కు అర్జీల అందజేత


ఎంపీ తుకారామ్‌కు అర్జీలు ఇస్తున్న మహిళలు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 4 : బుధవారం ఎంపీ తుకారామ్ బళ్లారి నగరానికి రావడంతో పలువురు మహిళలు తమ సమస్యలపై ఆయనకు అర్జీలు అందించి వారి సమస్యలను తెలియజేశారు. ఎంపీ తుకారామ్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలు తక్షణమే నెరవేర్చాలని తమ వరకు రాకుండా చూసుకోవాలని పలువురు అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బళ్లారి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్, బుడా అధ్యక్షులు జేఎస్ ఆంజనేయులు, తాలుకా పంచాయతీ ఈవో మడిగిన బసప్ప, కాంగ్రెస్ ప్రముఖులు వెంకటేష్, పలువురు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పోషణలో గుడ్డుదే ముఖ్యపాత్ర


పిల్లలకు పోషకాహారం అందిస్తున్న రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 4: పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడంలో గుడ్డు, అరటిపండు ముఖ్యపాత్ర పోషిస్తాయని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాలూకాలోని సంజీవరాయన కోట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అరటిపండు, గుడ్డును పంపిణీ చేశారు. అనంతరం ఆయయ మాట్లాడుతూ, ఉదయంపూట రాగిమాల్ట్, మధ్యాహ్నం గుడ్డుతో వేడిఅన్నం, అరటి పండు వంటివి సేవిస్తే పిల్లల్లో కనిపించే శారీరక అలసట దృష్టి దోషాలు తొలగిపోతాయన్నారు. గుడ్డు, శేంగా, అరటిపండు తినడం వల్ల పిల్లలకు శారీరక బలం చేకూరి జ్ఞాపకశక్తి ఎక్కువ కాలం ఉంటుందన్నారు. వ్యాధి రహిత జీవనం సాగించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్వేత, శశమ్మ, రామాంజనేయులు, గురుప్రసాద్, విజయ్ ముంద్రగి, గౌరమ్మ, రత్నమ్మ, సుంకమ్మ, ఈరమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీడీహళ్లి పోలీస్ స్టేషన్‌లో శాంతిసభ

బళ్లారిరూరల్, సెప్టెంబరు 4 : తాలుకాలోని పరమదేవుని పోలీస్‌స్టేషన్ ఆవరణలో 18 గ్రామాల ప్రజలకు శాంతిసభ నిర్వహించి వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసులు పలు గ్రామాలప్రజలకు తెలియజేశారు. శాంతిసభలో సీఐ రుద్రప్ప, ఏఎస్ఐ దుర్గాప్రసాద్, హనుమేష్, రవి, కుమారస్వామి, పలు గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్ పాఠశాలలో పీయూసీ

బళ్లారి సిటీ, సెప్టెంబర్ 4: బెళగల్లు రోడ్డులోని ఆకాశవాణి కేంద్రం సమీపంలో ప్రభుత్వ మౌలానా అజాద్ మోడల్ స్కూల్ అప్‌గ్రేడ్ చేసి 2024-25 నుండి ప్రీ-గ్రాడ్యుయేట్ కోర్సును ప్రారంభించారు. ఇప్పుడు ఇక్కడ విద్యార్థులు పీయూసీలో ప్రవేశం పొందవచ్చునని పాఠశాల అధికారులు తెలిపారు.

మచ్చలేని రాజకీయనేత సిద్దరామయ్య

● మహాకూటమి అధ్యక్షులు గాదిలింగనగౌడ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 4: సిద్దరామయ్య తన రాజకీయ పరిపాలనలో ఎలాంటి నల్లమచ్చ లే కుండా జీవితాన్ని గడిపారని రాష్ట్ర అణగారిన వర్గాల మహాకూటమి అధ్యక్షులు గాదిలింగనగౌడ అన్నారు. నగరంలో బుదవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బళ్లారిలోని విజయనగర శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ స్నాతకోత్సవం కోసం నగరానికి వస్తున్న గవర్నర్ తవరచంద గెహ్లోట్‌కు నల్లబ్యాడ్జీలతో గోబ్యాక్ గవర్నర్ అని నిరసన తెలపాలని కర్ణాటక రాష్ట్ర దోపిడీ వర్గాల మహాకూటమి నిర్ణయించిందని తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉండి, ఉపముఖ్యమంత్రిగా, రెండుసార్లు ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య తన పరిపాలనలో ఎలాంటి మచ్చ లేకుండా రాజకీయ జీవితాన్ని గడిపారన్నారు. అలాంటి వ్యక్తి కర్ణాటకలో సుపరిపాలన ఇవ్వడాన్ని బీజేపీ సహించదని, ఆ పార్టీ దేశంలోని ఇతర బీజేపీయేతర ప్రభుత్వాలను కూలదోయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గవర్నర్‌ను ఉపయోగించుకుని సిద్దరామయ్య ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేశారన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు పోరాడుతున్నామన్నారు ముడాకేసులో తన పాత్ర లేదని సిద్దరామయ్య స్పష్టంగా చెప్పినా... కారణం లేకుండా అధికారుల ద్వారా సిద్దరామయ్య అక్రమాన్ని చిత్రీకరించేందుకు కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమార్‌స్వామి ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ సందర్భంలో యూనియన్ నాయకుడు మానయ్య మాట్లాడుతూ లాయర్ అబ్రహం ఒక బ్లాక్ మెయిలర్ అని, తప్పుడు ఫిర్యాదు చేసినందుకు కోర్టు అతనికి జరిమానా విధించిందన్నారు.. అలాంటి వ్యక్తి ఫిర్యాదును గవర్నర్ ఆమోదించి, సిద్దరామయ్యపై వెంటనే ప్రాసిక్యూషన్‌కు అనుమతించడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరంగా వ్యవహరిస్తున్న గవర్నర్‌కు వ్యతిరేకంగా సెప్టెంబరు 6న మధ్యాహ్నం యూనివర్శిటీ గేటు ఎదుట నల్లబ్యాడ్జీల ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో యూనియన్ నాయకులు ఏ.మానయ్య. బి.కే.కెరెకోడప్ప, బి.ఎం.రఫీ, పి.గాదెప్ప, రామునాయక్,ధనంజయ్‌హమాల్, మల్లికార్జునగౌడ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గాదిలింగనగౌడ, మానయ్య తదితరులు

వాగులో కలుస్తున్న కాలకూట విషం..

● నిద్రమత్తులో కాలుష్య నివారణ అధికారులు ● ఏళ్ళతరబడి లభించని పరిష్కారం

బళ్ళారి గాంధీనగర్, సెప్టెంబరు 4: బళ్ళారి జీన్స్ పరిశ్రమకు పెట్టింది పేరు. అయినా... పరిశ్రమల నిర్వాహణకు అవసరమైన సౌకర్యాలు కల్పించకపోవడంతో జీన్స్ దుస్తుల వాషింగ్‌కు ఉపయోగించే కెమికల్ కలిసిన నీటిని సమీపాన ఉన్న కాలువల్లోకి నేరుగా వదులుతుండడంతో కాలువ చుట్టుప్రక్కల పరిసరాలు విషతుల్యమవుతున్నాయి. ఏళ్ళతరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా... కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జీన్స్ దుస్తుల వాషింగ్ యూనిట్‌ను బెంగళూరు రోడ్డు శివారు ప్రాంతమైన పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేశారు. పరిశ్రమల నిర్వహణ కోసం ప్రత్యేకంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటుచేయాలని నిబంధనలు ఉన్నా... సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదనే విషయం బహిరంగ రహస్యంగా మారింది. పారిశ్రామిక వాడకు ఆనుకుని వాగు ఉండడంతో దుస్తుల వాషింగ్ అనంతరం కెమికల్‌తో కూడిన నీటిని వాగులోకి వదులుతున్నారు. దీంతో వాగుకు ఆనుకుని ఉన్న కాకర్లతోట, ఆంధ్రాళ్ చుట్టుప్రక్కల ప్రజలు కలుషితమైన నీటి నుండే వచ్చే దుర్వాసను భరించ లేకపోతున్నట్లు పేర్కొంటున్నారు. అధికారులు ఫిర్యాదు చేసినా... ప్లాంట్ల నిర్వహణకులు ఇచ్చే మామూళ్ళతో ఫిర్యాదులను చెత్తబుట్టలకే పరిమితం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరం నుండి ఆంధ్రాల్ ప్రాంతానికి వెళ్ళే మార్గంలో ఈ వాగును దాటుకుని వెళ్ళాల్సి వస్తోంది. వాగులో ప్రవహిస్తున్న నీటిని చూస్తే మంచుకొండలు కరిగి వెళుతున్నాయా.. అన్న భ్రమ కలుగుతుంది. అది హిమపాతం కాదు.. కాలకూట విషం అని తెలిసిన తరువాత... వాగువైపు వెళ్ళడానికి ప్రజలు ధైర్యం చేయడం లేదు. ఇదే వాగులో గేదెలు... సేద దీరడంతో చర్మరోగాలకు గురవుతున్నట్లు పాడి పశువుల నిర్వహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగులో సేద దీరిన గేదెలు.. ఆవులు అదేరీతిలో ఇంటికి చేరడం... వాటిని నుండి పాలు పితికడంతో పాలు కూడా కలుషితమవుతున్నాయి... పాల సేకరణ కేంద్రాల్లో పాలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే వాగులో ప్రవహించే నీరు...సమీపంలో కాలువల్లోకి వెళ్లి అనంతరం హగరి నదిలో కలుస్తున్నాయి. స్థానిక కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఈ విషయంపై అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


ఆంధ్రాళ్ ప్రాంతంలో వాగులో ప్రవహిస్తున్న మురికి నీరు..



రోడ్డుపై గుంతలను సరిచేయండి

తోరణగల్లు, సెప్టెంబరు 4: తోరణగల్లు పారిశ్రామిక ప్రాంతంలోని రోడ్డుపై పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతలను తప్పించుకోలేకపోవడంతో ప్రజలకు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అందువల్ల వాహనదారులు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

ఆధార్ కోసం అగచాట్లు

తెలవారక ముందునుంచే పోస్టాఫీసు వద్ద పడిగాపులు


హెడ్‌పోస్టాఫీసు ముందు నేలపై కూర్చున్న వృద్ధులు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 4: ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలకు ఆధార్ కార్డే ప్రధానం కావడంతో నగరంలో ప్రజల ఆధార్ కార్డు కోసం ప్రతి కేంద్రం వద్ద క్యూకడుతున్నారు. నగరంలో ప్రధాన బ్యాంకులతో పాటు పోస్టుఫీసు, స్పందన, బళ్ళారి వన్ లాంటి ఎన్ని కేంద్రాలు ప్రారంభించినా నగర ప్రజలకు అవసరమైన ఆధార్ కార్డుల నమోదు, కార్డులో సర్దుబాటు, అడ్రస్సు మార్పులు లాంటివి కుదరక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పొద్దుపొడవక మునుపే ఎక్కువగా వృద్దులు ఆధార్ కేంద్రాల వద్ద క్యూ కడుతూ.. ఆధార్‌కార్డు నమోదు చేసే సిబ్బంది కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందులో ఆధార్ నమోదులో తరచూ సాంకేతిక పరమైన సమస్యలు ఏర్పడడంతో కార్డుల నమోదు మరింత ఆలస్యమవుతోంది. నగరంలోని జిల్లాధికారి కార్యాలయం సమీపంలో ఉన్న హెడ్‌పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన ఆధార కార్డు కేంద్రం వద్ద వృద్దులు కార్డు నమోదుకు కోసం మండుటెండలో నేలపై కూర్చోవడం చూసిన వారి మనసు కలతచెందుతోంది. జిల్లా అధికారులు ఆధార్ కార్డు నమోదులో వయోవృద్దులకు కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలని పలువురు స్థానికులు అధికారులను కోరుతున్నారు.

దేవదాసీ మహిళల డిమాండ్లను నెరవేర్చాలి


నిరసనలో దేవదాసీ మహిళలు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 4: దేవదాసీ మహిళల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక రాష్ట్ర దేవదాసీ మహిళా విముక్తి సంఘం బళ్లారి జిల్లా కమిషనర్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించింది. నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయం ఎదుట దేవదాసీ మహిళలు బుధవారం నిరసనలో పాల్గొన్నారు. జిల్లాధ్యక్షురాలు ఈరమ్మ, జిల్లాకార్యదర్శి ఏ.స్వామి మాట్లాడుతూ ఇప్పటి వరకు నెలవారీ ఫించన్ ఇవ్వకపోవడం వల్ల కుటుంబాల పోషణకు ఇబ్బందిగా ఉందని, ఇప్పుడు బకాయిలతో పాటు నెలవారీ ఫించన్ కూడా విడుదల చేయాలని అన్నారు. 2020 నుంచి ఫించన్ రాని దేవదాసీ మహిళలకు ఫించన్ ఇవ్వాలని, జిల్లా మినరల్ ఫండ్ డబ్బుతో దేవదాసీ మహిళలకు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం మహిళలపై సర్వే చేయాలని, సర్వే సమయంలో వయోపరిమితిని తొలగించాలన్నారు. 2020 లోసండూర్ తాలూకాలోని బండ్రి గ్రామంలో సర్వే నంబర్ 378లో ఎకరా భూమిని ఇచ్చారని, దేవదాసీ మహిళలకు ఆ భూమి కేటాయింపు వెంటనే జరగాలన్నారు. గంగా సంక్షేమ పథకానికి ఇప్పటి వరకు మాజీ దేవదాసీ మహిళలు దరఖాస్తు చేసుకున్నారని, వెంటనే బోర్‌వెల్ వేయాలని, మాజీదేవదాసీ మహిళలకు కనీసం రూ.5లక్షల రుణ సౌకర్యం కల్పించాలన్నారు. దేవదాసీ మహిళల పిల్లలకు వివాహ సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల్లోగా డబ్బులు విడుదల చేయాలని కోరారు. ఈసందర్భంగా సండూర్ తాలూకా కార్యదర్శి దురుగమ్మ, బళ్లారి తాలూకా అధ్యక్షుడు అంజినప్ప,కురుగోడు తాలూకా అధ్యక్షురాలు యంకమ్మ, వీరేశ్ , కురుగోడు తాలూకా కార్యదర్శి హులిగెమ్మ,కంప్లి తాలూకా అధ్యక్షురాలు,పలువురు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందేలా కృషిచేయాలి

- అధికారులకు ఎంపీ తుకారాం పిలుపు


దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తుకారాం

బళ్లారి సిటీ,సెప్టెంబరు 4: కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పలు పథకాలు అమలు చేస్తున్నామని, అధికారులు చొరవ చూపి అర్హులకు పథకాలు అందేలా కార్యాచరణ రూపొందించాలని ఎంపీ తుకారాం అన్నారు. నగరంలోని జిల్లా పంచాయితీ హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజలకు శాఖల వారీగా పథకాలు అందేలా స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో సాధారణం కంటేఎక్కువ వర్షపాతం నమోదైందని, 80శాతం నాట్లు పూర్తయ్యాయన్నారు. ఎరువులు విత్తనాల నిల్వలు సరిపడా ఉన్నాయన్నారు. రైతులకు అందాల్సిన పథకాలు జాప్యంలేకుండా అందేలా చూడాలని ఎంపీ అన్నారు. జిల్లాలో మిశ్రమ పంటల విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి తాలూకాలో భూసార పరీక్షల పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించి కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మిర్చిపంటకు మంచి ధర, మార్కెట్, కోల్డ్‌స్టోరేజీ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరగా, జిల్లాధికారులు స్పందించి అవసరమైన స్థలాన్ని ఆలదహళ్లి వద్ద గుర్తించినట్లు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో బాల్య వివాహాలు పునరావృతం కాకుండా ఉండేందుకు పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు నైతిక విలువలు నేర్పేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కంప్లి ఎమ్మెల్యే గణేశ్, సిరుగుప్ప ఎమ్మెల్యే నాగరాజు, మహానగర కార్పోరేషన్ మేయర్ ముల్లంగి నందీశ్, జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా పాల్గొన్నారు.

హోసూరు జోన్

ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణాలకు సీల్


దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

హోసూరు, సెప్టెంబరు 4 : హోసూరులో బుధవారం అధికారులు నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను సీజ్ చేసి రూ.6 వేలు జరిమానా విధించారు. ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రభాకరన్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ , సూపర్‌వైజర్, సిబ్బంది కలిసి నగరంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో 6 కిలోల ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేసి జరిమానా విధించారు. అలాగే వ్యాపార లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న రెండు దుకాణాలకు తాళాలు వేసి సీలు వేశారు. కార్పొరేషన్ సరిహద్దుల పరిధిలోని అన్ని దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ఫ్యాక్టరీలు తక్షణమే వ్యాపార లైసెన్స్ పొందాలని ప్రకటించారు. వ్యాపార లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న దుకాణాలు, వాణిజ్య సంస్థలకు తాళాలు వేసి సీలు వేశారు,


ఫుట్‌పాత్‌పై నిలిచి పోయిన వాహనాలు

నగలు స్వాధీనం - నిందితుడి అరెస్టు

హోసూరు(క్రైం) సెప్టెంబరు 4 : గత నెల హోసూరు సమీపంలో పట్టపగలు తాళం పగులగొట్టి ఆరున్నర తులాల నగలు దోచుకెళ్లిన దుండగులను బుధవారం అరెస్ట్ చేశారు. హోసూరు సమీపంలోని సేవగానపల్లికి చెందిన రైతు వెంకటేశ్ (55) అతని భార్య వ్యవసాయ భూమికి వెళ్లి పనులు నిర్వహిస్తుండగా దుండగులు ఇంటిలోకి చొరబడి బీరువాలోని ఆరున్నర తులాల నగలను దోచుకెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసిన వెంకటేశ్ కుటుంబం ఆందోళనకు గురై వెంటనే బాగలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై బాగలూరు పోలీసులు ఎస్.ఐ.సన్‌గిలి కరుప్పన్ ఆధ్వర్యంల్లో కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న సీసీ కెమరాల్లో రికార్డు అయిన వారి విచారించగా, బెంగళూరు నెలమంగల తాలూకా మాదనాయకనపల్లి సమీపంలోని జనతాకాలనీ కి చెందిన జగదీశ్ కుమార్ (38) నిందితుడని తెలిసింది. పోలీసులు అతనినుంచి ఆరున్నర తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు.



పోలీసులు అరెస్ట్ చేసిన బంగారు నగలను దోచుకెళ్లిన దుండగుడు

ప్రతి ఐదు నిమిషాలకు ట్రాఫిక్ జామ్

తోరణగల్లు, సెప్టెంబరు 4 : తోరణగల్లు గ్రామంలో, తోరణగల్లు స్టేషన్ వద్ద ప్రతి ఐదు నిమిషాలకు ఒకసారి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నది. ఇందువలన పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వాహనాల పార్కింగ్ వలన సమస్య ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ని కంట్రోల్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దరోజీ చెరువును పర్యాటక కేంద్రంగా చేయాలి

కంప్లి, సెప్టెంబరు 4 : జిల్లాలో అతిపెద్దదైన దరోజీ చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో తుకారామ్ ఎమ్మెల్యేగా వున్న సమయంలో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా ఎంపికచేశారు. హంపి కరడిధామ, వివిధ పర్యాటక కేంద్రాలు ఎలా ఆకట్టుకుంటాయో ఈ ప్రాంతాన్ని కూడా ఆకట్టుకునేలా చర్యలు చేపడతామని తెలిపారు. కానీ ఇంతవరకు వాటిపై ఇప్పుడు ఎంపీ అయినా దృష్టి సారించడం లేదన్నారు. ఆ ప్రాంతంలోని కోడి వీరభద్రేశ్వరాలయం, పొర్లుతున్న నీరు, చెరువు, కొండలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. బళ్లారి, కంప్లి, గంగావతికి వెళ్లే వెళ్లు పర్యాటకులు ఆప్రాంతాన్ని సందర్శిస్తున్నారు. ఆది, శనివారాలు పాఠశాల విద్యార్థులు కూడా ఆటోలు, వాహనాలలో వెళ్లి స్వామివారిని దర్శించుకుని చెరువును తిలకించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా స్థానిక ఎంపీ దీనిపై దృష్టిసారించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.


దరోజీ వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న చెరువు

లారీల ద్వారా యాష్ రవాణా బంద్ చేయాలి


లారీలో నుంచి లీకవుతున్న యాష్

కంప్లి, సెప్టెంబరు 4: కుడితిని వద్ద వున్న కేపీసీఎల్ నుండి యాష్ పౌడర్‌ను లారీల ద్వారా మళ్లించేందుకు అనుమతి ఇవ్వరాదంటూ కంప్లి డీఎస్ సంచాలకులు సన్నప్ప కోరారు. గత రెండు రోజులుగా కేపీసీఎల్ నుంచి గంగావతి వైపు యాష్‌ను లారీల ద్వారా తరలిస్తున్నారు. లారీల ద్వారా యాష్ లీకేజీ అయి రోడ్లపై పడుతోంది. ఆ యాష్‌పై నుంచి వాహనాలు వెళ్లడంతో దుమ్ముధూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పంటలపై కూడా యాష్ పడటంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. డిపార్ట్‌మెంట్ నిర్లక్ష్యం వల్లే ఇలా లారీల్లో యాష్‌ను మళ్లిస్తున్నారని ఆరోపించారు. ముందు ఇలాగే అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తిమ్మలాపురం నార్త్ గేట్ వద్ద ప్రతిఘటనలు చేపడతామని హెచ్చరించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

సర్వేపల్లి రాధాకృష్ణన్ (జయంతి)



భారతరత్న గ్రహీత డాక్టర్ సర్వే పల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబరు 5న తమిళనాడు రాష్ట్రం తిరు త్తణి లో జన్మించారు. భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి, రెండో రాష్ట్రపతిగా వ్యవహరించారు. అత్యంత క్లిష్ట సమయాల్లో ప్రధానమంత్రులకు మార్గదర్శకం చేశారు. ప్రొఫెసర్‌గానే కాక వైస్‌చాన్స్‌లర్‌గా కూడా వ్యవహరించారు. రష్యాలో భారత రాయబారిగా వ్యవహరించారు. ఆయన రచించిన 'ఇండియన్ ఫిలాసఫీ' అనే పుస్తకం ప్రపంచవ్యాప్తంగా పేరొందింది. యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్‌లో సభ్యుడిగా విద్యావ్యవస్థ అభివృద్ధికి విలువైన సలహా, సూచనలు చేశారు. ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా ఆచరి స్తున్నారు. 1975 ఏప్రిల్ 17న కన్నుమూశారు.

మదర్ థెరీసా (వర్ధంతి)



మానవత్వానికి మారుపేరుగా నిలిచిన మదర్ థెరీసా 1910 ఆగస్టు 26న ప్రస్తుత ఉత్తర మెసిడో నియాలోని స్కోప్జే ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు ఆగ్నెస్ గోక్షా బొజాక్షు. అల్బేనియా దేశానికి చెందిన రోమన్ కేథలిక్ సన్యాసిని. మిషనరీస్ ఆఫ్ చారిటీని స్థాపించి 1950లో స్థాపించి 45ఏళ్లపాటు నిర్వహించి భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా పేదలకు, రోగగ్రస్తులకు, అనాథలకూ, మరణశయ్యపై ఉన్నవారికి పరిచర్యలు చేశారు. 1979లో నోబెల్ శాంతి పురస్కారం, 1980లో అత్యున్నత భారత రత్న పురస్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు. 1997 సెప్టెం బరు 5న కన్నుమూశారు. 2010లో ఆమె శత జయంతిని పురస్కరించుకుని ఆమె గౌరవార్థం 5 రూపాయల ప్రత్యేక నాణెంను విడుదల చేశారు.

రెంటాల గోపాలకృష్ణ (జయంతి)



ఆధునిక తెలుగు సాహితీరంగంలో అనవరత కృషీవలుడిగా అక్షర షష్టిపూర్తి జరుపుకొన్న అరుదైన రచయిత రెంటాల గోపాలకృష్ణ 1920 సెప్టెంబరు 5న గుంటూరు జిల్లా రెంటాలలో జన్మించారు. పత్రికా రచయితగా, కవి, అనువాదకులు, నాటకకర్త, విమర్శకుడిగా, వక్తగా పేరొందారు. ప్రజానాట్య మండలి కళాకారుడిగా పలు నాటకాలు రాశారు. సుమారు 200 పుస్తకాలు రచించగా 150కుపైగా పదే పదే ముద్రితం కావడం విశేషం. 1995 జూలై 18న కన్నుమూశారు.

బీకేఎస్ వర్మ (జయంతి)



డాక్టర్ బీకేఎస్ వర్మ 1949 సెప్టెంబరు 5న బెంగళూరులో జన్మిం చారు. ప్రముఖ చిత్రకారుడిగా రాణించారు. ఎక్కువగా పర్యావరణం, సాంఘిక సమస్యలపై ఆయన బొమ్మలు గీశారు. దేవతల బొమ్మలకు సరికొత్త రూపం కల్పించారు. విశ్వకన్నడ సమ్మేళనంలో భాగంగా కావ్యచిత్ర పేరిట ప్రదర్శనలు నిర్వహించారు. కర్ణాటక రాజ్య పురస్కార, రాష్ట్ర లలిత కళా అకాడమీ అవార్డు, రాజ్యోత్సవ అవార్డు, గౌరవ డాక్టరేట్ సహా పలు పురస్కారాలు అందుకున్నారు. 2023 ఫిబ్రవరి 6న కన్నుమూశారు.

టీఎన్ శేషగోపాలన్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత మదురై తిరుమలై నంబి శేషగోపాలన్ 1948 సెప్టెంబరు 5న తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో జన్మించారు. కర్ణాటక గాత్ర విద్వాంసులు, స్వర కర్తగాను పేరొందారు. ప్రత్యేకించి వీణ, హార్మోనియం వాదనలో సిద్ధహస్తులు. హరికథా కళాకారుడు. సంగీత కళా శిఖామణి, సంగీత కళానిధి, గాయక శిఖామణి, క్షైమామణి తదితర పురస్కారాలు అందుకున్నారు.

3 ఎకరాలకంటే తక్కువ ఉంటే ఖాళీ చేయించొద్దు

» మంత్రి ఈశ్వర్ ఖండ్రే... రైతులకు అండగా ఉంటామని భరోసా

బంగారపేట, సెప్టెంబరు 4: కోలారు జిల్లా అటవీభూముల చుట్టుపక్కల రైతులు 3 ఎకరాలకంటే తక్కువ భూమిలో సాగు చేస్తుంటే ఖాళీ చేయించరాదని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె నేతృత్వంలో అటవీశాఖ అధికారులు తీర్మానించారని ఎమ్మెల్యే నారా యణ స్వామి తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా సర్వే చేసేవేళ మంత్రి సూచనలు పాటించాలని సూచించినట్టు తెలి పారు. రైతులను ఇబ్బంది కలిగించరాదన్నారు. ఎన్నో ఏళ్లుగా రైతులు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని వారికి అన్యాయం జరగరాదన్నారు. పంటనష్టపోయిన రైతులకు సానుభూతి వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మూడు ఎకరాలకంటే తక్కువ కల్గిన రైతులకు అన్యాయం కారాదన్నారు. సీఎం, డీసీఎంలు కూడా స్పష్టమైన సూచనలు చేశార న్నారు. ఈ సందర్భంగా కోలారు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, మాలూరు ఎమ్మెల్యే కెవై నంజేగౌడ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో ఎమ్మెల్యేల బృందం

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

బాగేపల్లి, సెప్టెంబరు 4: పట్టణంలోని తాలూకా పంచాయతీ ఆవరణలో బుధవారం 2023-24 సంవత్సరానికి దేవరాజ్ అరసు వెనుకబడినవర్గాల అభివృద్ధి మండలి నుంచి లబ్ధిదారులకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుబ్బారెడ్డి మాట్లా డుతూ వెనుకబడిన వర్గాల మండలి నుంచి పలు సౌలభ్యాలు ఉన్నాయని అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకోసం 36మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. ప్రతి మిషన్ విలువ సుమారు రూ.18వేలుగా ఉందన్నారు. తహసీల్దార్ మనిషా మహేశ్ ఎస్ పత్రి, తాలూకా పంచాయతీ ఈఓ రమేశ్, సాక్షరతా అధికారి శివప్ప, ఏడీఓ యమనప్ప, జిల్లా మేనేజర్ శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు పంపిణీ

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకే పోటీలు



పోటీల ప్రారంభంలో ప్రముఖులు

దొడ్డబళ్లాపుర, సెప్టెంబరు 4: తాలూకాలోని సాసలు హోబళిలోని పుట్టలింగయ్యనపాళ్య ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో క్లస్టర్‌స్థాయి ప్రతిభాకారంజి పోటీలు బుధవారం నిర్వహించారు. బీఈఓ సైయిదా అనీస్ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించి మాట్లాడుతూ పిల్లల్లోని ప్రతిభను ఆవిష్కరించేందుకు ఇదో చక్కటి వేదికగా ఉంటుందన్నారు. క్రీడలు, కళలు, సాహిత్యం తదితర అంశాలలో రాణించేందుకు సహకారిగా ఉంటాయన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు గాయనం, నృత్యం, ఏకపాత్రాభినయం, నాటకం, చర్చాగోష్టి, జానపదనృత్యం, భావ గీతం, వ్యాసరచన పోటీలు వంటి వాటిల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. విజేతలకు బహుమతులు అందచేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం రవికుమార్, ప్రతిభా పోటీల కార్యక్రమ అధ్యక్షుడు రామచంద్రయ్య, ఈసీఓ భీమరాజ్, జయశ్రీ, ఎస్‌డీఎంసీ అధ్య క్షుడు దేవరాజ్, దొడ్డబళ్ళాపుర ఉపాధ్యాయుల సంఘం పదాధికారులు, క్లస్టర్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మరింతగా నేర్చుకోవాలి

శిడ్లఘట్ట, సెప్టెంబరు 4: పట్టు వ్యవసాయ విద్యాలయం విద్యార్థులు తమకు అన్నీ తెలుసుననే భావన వీడి మరిన్ని నేర్చుకోవాలని రైతులకు నేర్పించేందుకు సహకరించాలని చింతామణి పట్టు వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాధ్యాపకుడు డాక్టర్ నరేశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని సుగటూరు గ్రామంలో యూనివర్సిటీ ఫైనలియర్ విద్యార్థులచే గ్రామీణ కార్యానుభవ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. రైతులు తాము అవలంబించే వ్యవసాయ విధానంలో పాత పద్ధతులు అనుసరిస్తున్నారన్నారు. తద్వారా ఆశించిన మేరకు లాభాల శాతం, తక్కువ దిగుబడి ఉన్నాయని సాంకేతిక పద్ధతులను జోడించడం ద్వారా దిగుబడి పెంచేందుకు అవగాహన కల్పించాలన్నారు. మూడు నెలలపాటు మట్టి పరీక్ష, పశువుల ఆరోగ్యం, గ్రామస్థులకు ఆరోగ్య శిబిరం, సేంద్రీయ సాగు, సమగ్ర కృషి విధానాలపై జాగృతి చేపట్టే కార్యక్రమాలు ఉంటాయన్నారు. సహాయక ప్రాధ్యాపకుడు డాక్టర్ నవీన్ మాట్లాడుతూ మట్టి పరీక్ష నమూనాలను ఏ విధంగా సేకరించాలి, ఉత్తమ దిగుబడికి ఎలాంటి విధానాలు పాటించాలి అనే అంశాలపై వివరించారు. సహాయ ప్రాధ్యాపకురాలు డాక్టర్ రమాశ్రీ మాట్లాడుతూ పౌష్టికాంశాల కొరత వల్ల పంటలకు రోగాలు సోకుతాయని, వైరస్ నియంత్రణకు పాటించాల్సిన విధానాలను తెలిపారు. కొత్త వంగడాలు, శాస్త్రీయ సాగు పద్ధతులు, పశువులు, గొర్రెల నిర్వహణ, పట్టు సాగు విధానాలపై వివరించారు. శిబిరంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు నారాయణగౌడ, కార్యదర్శి గిరీశ్, గ్రామపంచాయతీ సభ్యుడు సతీశ్‌కుమార్, కంట్రాక్టర్ దేవరాజ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నేటి నుంచి రచ్చ రచ్చే..!

ఇండియా-సి, డి జట్ల మధ్య నేడు తొలి పోటీ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4: దులీప్‌ట్రోఫీ టోర్నీ గురువారం నుంచి అనంతపురం క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరగనుంది. తొలిమ్యాచ్ ఇండియా-సి, ఇండియా-డి జట్ల మధ్య జరగనుంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యులు మాంచో ఫెర్రర్, ఎన్నికైన కార్యదర్శి సతీష్ అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఆయా జట్ల కెప్టెన్లు, ఆటగాళ్లతో మాట్లాడి సదుపాయాల కల్పనపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రేక్షకులు కేటగిరీల వారీగా వాహనాల పార్కింగ్, ఎంట్రీ గేట్లు, గ్రౌండ్‌లో బ్లాక్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, మీడియా కోఆర్డినేటర్ తిమ్మప్ప, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు షాబుద్దీన్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్ రెడ్డి, మధు ఆచారి తదితరులు పాల్గొన్నారు.



ఆటగాళ్లతో మాట్లాడుతున్న త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంచో ఫెర్రర్

రెండో రోజు సాధన: దులీప్‌ట్రోఫీలో పాల్గొనే ఇండియా-సి, ఇండి యా-డి జట్ల ఆటగాళ్లు అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో రెండో రోజు సాధన చేశారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటల వరకు ప్రాక్టీస్ చేశారు.

ఈ వస్తువులు తేవద్దు: స్టేడియంలోకి ల్యాప్‌టాప్, కెమెరాలు, అగ్గిపెట్టెలు, బైనాక్యులర్స్ బ్యాటరీలు, బ్యాగులు, బ్యానర్లు, సిగరెట్లు, లైటర్లు, హెల్మెట్లు, నీళ్ల బాటిళ్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, షార్ప్ మెటల్స్ వంటి తదితర వస్తువులను అనుమతి లేదు.

ప్రత్యక్ష ప్రసారం: దులీప్‌ట్రోఫీలో భాగంగా జరిగే ఐదు మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. స్టార్‌స్పోర్ట్స్ 18, జియో చానల్‌లో లైవ్ టెలికాస్ట్ చేయనున్నారు. మొదటి మ్యాచ్ 5 నుంచి 8వతేదీ వరకు ఇండియా-సి, ఇండియా-డి జట్ల మధ్య (ఏ గ్రౌండ్)లో, రెండో మ్యాచ్ 12 నుంచి 15వతేదీ వరకు ఇండియా ఏ-ఇండియా డి (ఏ గ్రౌండ్), మూడో మ్యాచ్ 12నుంచి 15వతేదీ వరకు ఇండియా బి-ఇండియా సి (బి గ్రౌండ్), నాలుగో మ్యాచ్ 19 నుంచి 22వరకు ఇండియా ఏ-ఇండియా సి (ఏ గ్రౌండ్), ఐదో మ్యాచ్ ఇండియా బి-ఇండియా డి(బి గ్రౌండ్)లలో పోటీలు జరగనున్నాయి.

హంసలేఖ వ్యాఖ్యలపై విమర్శల వెల్లువ

బెంగళూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత దర్శకుడు హంసలేఖపై వ్యతిరేక నినాదాలు పెరుగుతున్నాయి. ఇటీవలే మళయాళీలు బుద్ధివంతులు కన్నడిగులు బుద్ధి ఉపయోగించరనే వ్యాఖ్య హల్‌చల్ చేస్తోంది. ఆయన వ్యాఖ్యలు కన్నడిగులకు తీరని అవమానమని సోషల్‌మీడియాలో ట్రెండ్ అయ్యింది. పలు విమర్శలకు కారణమవుతోంది. ఆయన పాల్గొనే కార్యక్రమాలను వీక్షించేది లేదని హెచ్చరిస్తున్నారు. ఇటీవలే బ్రాహ్మణుల కుటుంబంలో భగవద్గీతతోపాటు చింతన గంగ పుస్తకం ఉంటుందనే వ్యాఖ్యలు చేసి వివాదాలకు కారణమైన విషయం తెలిసిందే. జూలైలో జైనుల ఫిలాసఫీలో 24 జన్మలు ఉంటాయనే అంశంపైనా వ్యతి రేకంగా మాట్లాడారు. 2021 నవంబరులో పెజావర స్వామి జీపైనా వ్యాఖ్యలకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇలా తరచూ వివాదా లకు కారణమవుతున్న సంగీత దర్శకుడు హంసలేఖ మళయాళీలను కొనియాడడం విమర్శలకు దారితీసింది.

దులీప్‌ట్రోఫీ ఏర్పాట్లు భేష్

అనంత అభిమానం నచ్చింది

ఇండియా సి, డి జట్ల కెప్టెన్లు రుతురాజ్, శ్రేయస్

నేటి నుంచి మొదటి మ్యాచ్



విలేకరుల సమావేశంలో శ్రేయస్ అయ్యర్, రుతురాజ్ గైక్వాడ్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4: దులీప్‌ట్రోఫీ నిర్వాహకులు ఏర్పాట్లు చాలా బాగా చేశారని ఇండియా సి, డి జట్ల కెప్టెన్లు రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నారు. దులీప్‌ట్రోఫీకి సంబంధించి బుధవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలోని ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జాతీయ స్థాయిలో అతిపెద్ద క్రికెట్ టోర్నీ దులీప్‌ట్రోఫీ అని తెలిపారు. అలాంటి టోర్నీలో ఆడే అవకాశం లభించడం అదృష్టమన్నారు. ఈటోర్నీలో ప్రతిభ ఆధారంగానే భారత జట్టులో చోటు దక్కుతుందని పేర్కొన్నారు. యువ క్రీడాకారులకు ఇదో మంచి అవకాశమన్నారు. భారత జట్టులో ఉండే ప్రతి క్రీడాకారుడు కచ్చితంగా ఆడాల్సిన టోర్నీ దులీప్‌ట్రోఫీ అని అన్నారు. జిల్లాలో నెలకొన్న విభిన్న వాతావరణం అద్భుత అనుభూతి కలిగిస్తున్నట్లు వెల్లడించారు. దులీప్‌ట్రోఫీకి స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ హాజరు కాకపోవడాన్ని ప్రశ్నించగా అది తమ పరిధిలోని అంశం కాదని వివరించారు. రెండు రోజుల పాటు ప్రాక్టీస్ సజావుగా జరిగిందన్నారు. అనంతపురం జిల్లా వాతావరణం, ప్రజల అభిమానం తమకు బాగా నచ్చిందన్నారు. కాగా గురువారం నుంచి నాలుగు రోజుల పాటు ఇండియా-సి, ఇండియా-డి జట్ల మధ్య మ్యాచ్ జరగనున్న విషయం తెలిసిందే.

గుంతకల్లు- చిక్కజాజూర్ ప్యాసింజరు రైలు రద్దు

గుంతకల్లు, సెప్టెంబరు 4: గుంతకల్లు- చిక్కజాజూర్-గుంతకల్లు ప్యాసింజరు రైలు నెం(07586/85)ను ఈ నెల 8వ తేదీ నుంచి నెలపాటు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌత్ ఈస్ట్రన్ రైల్వేలోని బిలాస్‌పూర్ రైల్వే డివిజన్‌లో జరుగుతున్న నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా గుంతకల్లు-చిక్కజాజూర్ మధ్యన నడిచే ప్యాసింజర్ అప్ అండ్ డౌన్ సర్వీసులను ఈ నెల 8వ తేదీ నుంచి అక్టోబరు 6వ తేదీ వరకూ రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

టమాట మాట్లాడలేం..!

భారీగా పతమైన టమోట ధరలు

గిట్టుబాటు ధరలేక నష్టాల ఊబిలో రైతులు

వర్షాలకు మరింతగా నష్టపోయిన దుస్థితి

పంటను పశువులకు వదిలేస్తున్న వైనం

అనంతపురం రూరల్/ఆత్మకూరు,సెప్టెంబరు 4: ధరలు పతనమవడం తో టమోటా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి, ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మరిన్ని అప్పులు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు మార్కెట్‌లో వ్యాపారుల దోపిడీ రైతులను మరింత కుంగదీస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 24వేల హెక్టారల్లో సాగు

ఉమ్మడి జిల్లాలో 24వేల హెక్టారల్లో టమోటా సాగు చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కంబదూరు, కళ్యాణదుర్గం, అనంతపురం రూరల్, ముదిగుబ్బ, కదిరి, ధర్మవరం, అనంతపురంరూరల్, పామిడి, శెట్టూరు, ఆత్మకూరు, గార్లదిన్నె, కూడేరు తదితర మండలాల్లో టమోటాను అధికంగా సాగు చేశారు. గత ఏడాది 18వేల నుంచి 20వేల హెక్టారల్లో పంట సాగైంది. ఏటా సాగు విస్తీర్ణం పెరుగు తోంది. దిగుబడులు కూడా బాగానే ఉన్నాయి. రోజు కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు 2500టన్నుల నుంచి 3500టన్నుల మధ్య వస్తున్నాయి. అయితే గిట్టుబాటు ధర లేకపోవడం రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. వాతావరణ మార్పులతో కాయలపై మచ్చలు వంటివి వస్తే ధర లేకుండా పోతోంది. దీనికితోడు తరచూ కురుస్తున్న వర్షాలకు పంట నీటి పాలవుతోంది. నీరు కాయలుగా పడి నో సేల్ కింద పడిపోవడం, లేదా తక్కువ ధర పలకడం జరుగుతోంది. ఈక్రమంలో పంటను మార్కెట్‌కు తీసుకువెళ్లలేక కొందరూ రైతులు తోటలోనే వదిలేస్తున్నారు. మరికొందరు మార్కెట్‌లో అమ్ముడు పోకపోతే అక్కడే వదిలేస్తున్నారు.

ఒక్కసారి తగిలితే చాలు..

నిత్యం నష్టాలు ఎదురవుతున్నా రైతులు టమోటా పంట సాగును వదలడం లేదు. ఒక్కసారి దిగుబడి, రేటు తగలితే తమ దశ మారిపోతుందన్న నమ్మకమే రైతన్నను టమోటా సాగువైపు నడిపిస్తోంది. మొక్క నాటడం మొదలుకొని పంట కోతకొచ్చేంతవరకు నిత్యం పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. ఈక్రమంలో ఎకరా సాధారణ సాగుకే రూ.40 నుంచి రూ.50వేలు పెట్టుబడులు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఆ తరువాత ఒక సారి పంట కోతకు ఎకరానికి ఆరుగురు కూలీల లెక్కన ఒక్కొక్కరికి రూ.300లు చొప్పున రూ.2వేలు చెల్లిస్తున్నారు. ఆ తరువాత దిగుబడులను మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు దూరాన్ని బట్టి సగటున ఒక్కో బాక్సుకు రూ.5 చెల్లిస్తున్నారు.

మార్కెట్‌లో దోపిడీ

వ్యయప్రయాసలకోర్చి పంట పడించి మార్కెట్‌కు తేవడం ఒకెత్తైతే, మార్కెట్‌లో సరుకు అమ్ముడుపోయేంత వరకు రైతులు పడే ఆందోళన మరో ఎత్తు. వ్యాపారుల దోపిడీతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఇక్కడ పది శాతం కమీషన్ రూపంలో రైతుల నుంచే వసూలు చేస్తున్నారు. దీనికితోడు బాక్సుల బాడుగ, హమాలీ కూలీ బాక్సుకు రూ.1. ఇతరత్ర ఖర్చులన్నీ కలుపుకుని రూ.100కు రూ.15లు మార్కెట్‌లోనే పోతోంది. ఇది చాలదన్నట్లు 100బాక్సులకు 5 బాక్సులు లెస్ చేస్తున్నారు. అంటే బాక్సు రూ.100తో అమ్ముడు పోతే..ఐదు బాక్సులకు రూ.500లు అక్కడ కోత పడుతోంది. ఈ ఖర్చులన్నీ పోయే సరికి రైతులకు ఏమీ మిగలడం లేదు. పంటకోసి కూలీలకు చేతినుంచి ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సీజన్ ప్రారంభం నుంచి ఇదే దుస్థితి..

ఈ సంవత్సరం జూలై నుంచి టమోటా సీజన్ ప్రారంభమైంది. మార్కెట్‌లో ఏనాడు రైతులకు లాభం చేకూరని పరిస్థితి. గత రెండు నెలల కాలంలో మార్కెట్‌లో 15కిలో బాక్సు రూ.400దాటిన దాఖలాలు లేవు. ప్రస్తుతం బాక్సు రూ.300ల వరకు పలుకుతోంది. అయితే అవి మూడు, నాలుగు లాట్ల కంటే ఎక్కువగా ఉండవనే చెప్పొచ్చు. అవి కూడా మార్కెట్‌లో ధర బాగా పలుకుతోందని చెప్పడానికి మాత్రమేనని ఆయా వర్గాల సభ్యులు చెబుతున్నారు. ఎక్కువ శాతం రూ.50 నుంచి రూ.150లు లోపే ఉంటున్నాయి. ప్రతి రోజు పలికే ధరలే ఇందుకు నిదర్శనం. కనీసం బా క్సు రూ.200పలికినా రైతులకు కొంత ఊరటగా ఉంటుంది. మార్కెట్‌లో ఆ పరిస్థితి లేకపోవడం రైతులకు తీవ్ర వేదన, నష్టాలను మిగుల్చుతోంది.



తోటలో టమోటాను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



మార్కెట్‌కు వచ్చిన టమోటా

ఇంట్లో వాళ్లు వద్దంటున్నా..



ఇంట్లో వాళ్లు వద్దంటు న్నా వినకుండా ఎకరా పొలాన్ని గుత్తకు తీసుకుని టమోటా సాగు చేశా. దాదాపు రూ.50వేలు పెట్టుబడి పెట్టా. పంట బాగానే వచ్చింది. వర్షానికి పూర్తిగా దెబ్బతింది. అధిక వర్షానికి పొలంలో మూడు నాలుగు రోజులు నీళ్ల నిలబడ్డాయి. దీంతో కాయలు తోటలోనే దెబ్బతి న్నా యి. పంట కోయగా 60 బాక్సుల య్యాయి. రూ.1000బాడుగ ఇచ్చి మార్కెట్ తెచ్చా. బాక్సు రూ.రెండువందలతో అమ్ముడు పోయింది. నాకు ఇంకేం మిగులుతుంది.

- గంగన్న, రైతు, కండ్లపల్లి గ్రామం, పామిడి మండలం

పశువుల మేతకు వదిలేస్తా..

మూడు ఎకరాల్లో పంట సాగు చేశా. రూ.1.5లక్షలు పెట్టుబడి పెట్టా. వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినింది. ఈసారి పంట సాగుకైనా పెట్టుబడులు కూడా దక్కేలే లేవు. పంట దెబ్బతినడంతో పశువుల మేతకు వదిలేయాలని నిర్ణయించుకున్నా.

- పోతిరెడ్డి, రైతు, ఆత్మకూరు

వర్షాల వల్లే...



రెండు ఎకరాల్లో రూ.లక్షకుపైగా పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశా. చేతికొచ్చిందనుకునేలోపు వర్షం పంటను దెబ్బతీసింది. వర్షానికి పంట మొత్తం దెబ్బతినింది. కాయలు పనికిరాకుండా పోయాయి. దీనికి తోడు మార్కెట్‌లో ధరలు అంతంతగానే ఉంటున్నాయి. దీంతో పంట సాగు చేయాలన్నా పెట్టుబడులకు భయపడాల్సి వస్తోంది.

- వెంకటరెడ్డి, రైతు, ఆత్మకూరు

10న అడ్మిషన్లకు కౌన్సెలింగ్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 4: అనంత వైద్యకళాశాలలో పారా మెడికల్ కోర్సుల్లో చేరడానికి ఈనెల 10న అడ్మిషన్ల కౌన్సెలింగ్ చేపడుతు న్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు బుధవారం ఓప్రకటనలో తెలి పారు. మొత్తం 69 సీట్లు ఉన్నాయని, అందులో డీఎంఎల్‌టీ10, డీఓఏ10, డీఏఎన్ఎస్30, డీఎంఐటీ10, డీఈసీజీ3, డీఆర్‌జీఏ3, డీడీఆర్ఏ3సీట్లు ఉన్నాయన్నారు. ఈసీట్లకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 10న తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకొని అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

వరద బాధితులకు విరాళాలివ్వండి

పుట్టపర్తి, సెప్టెంబరు 4: వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ విరాళాలు అందించాలన్నారు. దాతలు ఈ కింది బ్యాంక్‌లకు తమ విరాళాలు పంపాలన్నారు.

- ఎస్బీఐ సీఎంఆర్ఎఫ్ అకౌంట్ నెంబర్ 38588079208 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్బీఐఎన్ 0018884,
- యూనియన్ బ్యాంకు సీఎంఆర్ఎఫ్ అకౌంట్ నెంబర్ 110310100029039 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0830798,
- ఎస్బీఐ ఏపీడిజాస్టర్ మేనేజ్‌మెంట్ అకౌంట్ నెంబర్ 00000036897128069 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్బీఐఎన్ 0016857